కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

మాట్లాడుతున్న మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పట్టణ ప్రజల సహాయ సహకారాలతో 100 నిఘా కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. సీసీ కెమెరాల ద్వారా నేరస్తులు నేరాలు చేయడానికి భయపడతారని చెప్పారు. నేరస్తులను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకోవచ్చని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ముందుకు వచ్చి జిల్లాలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, ఏఎస్పీ చైతన్యా రెడ్డి, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి

ఎంపీవోతో కలిసి పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 20 : వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని పల్లె ప్రకృతి వనం, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బషీరుద్దీన్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు నవీన్‌గౌడ్, సృజన్‌రెడ్డికి సూచించారు. మండలంలోని నాగారాం, కొల్లూరు గ్రామాల్లో నర్సరీలు, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలను ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో నర్సరీల్లో మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని, ప్రతిరోజూ నీళ్లు పట్టించాలని అన్నారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా డంపింగ్ యార్డులోనే వేయించాలని కార్యదర్శులకు సూచించారు. వైకుంఠధామాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 20 : పదో తరగతి పరీక్షలంటే భయపడొద్దని, ధైర్యంగా రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. ఎల్లారెడ్డిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారినుంచి సమాధానం రాబట్టారు. అనంతరం ఆయన విద్యార్థినులకు లాంగ్‌నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షలంటే ఏమాత్రం భయం వద్దని, మంచిగా రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలోని నీటి పరిస్థితిని పరిశీలించారు. నీటి సమస్య ఉన్నందున వెంటనే బోరు వేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో ఎండాకాలంలో విద్యార్థినులకు ఏమాత్రం నీటికి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు పట్టణంలోని డంపింగ్ యార్డ్‌కు వెళ్లి అక్కడ చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. పక్కనే ఉన్న కంపోస్ట్‌షెడ్డును చూసి దాని పనితీరును మున్సిపల్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు మహిళలు కలెక్టర్‌ను కలిసి తమకు డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్, ఎంపీవో ప్రకాశ్, ఎంఈవో వెంకటేశం, మున్సిపల్ ఏఈ వినోద్‌కుమార్, సిబ్బంది, గిరిజన గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు ఉన్నారు.

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలి

వేసవికాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గత సంవత్సరం వేసవికాలంలో తీసుకున్న చర్యలను ఆయన వార్డుల వారీగా అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని వార్డుల్లో తాగునీటి పరిస్థితి ఎలా ఉంది. నీటి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా.. వార్డుల్లో ఉన్న బోర్లు మంచిగా ఉన్నాయా.. ఒకవేళ సమస్య వస్తే వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు కాకుండా చూసుకోవాలన్నారు. నీటి సప్లయ్ చేసే బోర్లు ఎండిపోతే సమీపంలో ఉన్న బోర్లను ఎంగేజ్ తీసుకొని నీటిని సప్లయ్ చేయాలన్నారు. వందశాతం పన్ను వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్, మేనేజర్ వాసంతి, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

యాడారంలో ఉపాధిహామీ మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్

బీబీపేట్, ఫిబ్రవరి 20 : మండలంలోని యాడారం, కోనాపూర్ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో 50 మందికి తగ్గకుండా పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో 100 శాతం నర్సరీలు ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రజిని, టీఏ వినయ్, పంచాయతీ కార్యదర్శులు భరత్, ఫీల్డ్ అసిస్టెంట్లు అశోక్, నారాయణ రెడ్డి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

నిరసన తెలియజేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగులు గురువారం భోజన సమయంలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని గంటపాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక కార్మిక సంఘం తమ సంస్థలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని దేశవ్యాప్తంగా సమ్మెకు దిగడం చాలా అరుదైన ఘటన అని అన్నారు. ఈ సమ్మెలో పాలుపంచుకోవడానికి ఉద్యోగులు సిద్ధమయ్యారని తెలిపారు. ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

మాచారెడ్డి, ఫిబ్రవరి 20 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల పై శ్రద్ధ చూపాలని ఏబీవీపీ మండల కన్వీనర్ శశి డిమాండ్ చేశారు. మాచారెడ్డిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళాశాలకు వచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదన్నారు. కళాశాల ఆవరణలో తిరిగినా మందలించడం లేదని, అధ్యాపకులు ఫోన్‌లో లీనమవుతున్నారని ఆరోపించారు. విద్యార్థులపై శ్రద్ధ చూపకపోవడంతో గత ఏడాది ఉత్తీర్ణత శాతం పడిపోయిందని చెప్పారు. కార్యక్రమంలో నితిన్, అభి, హరి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

రాజంపేటలో గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయ మహాలక్ష్మి

రాజంపేట్, ఫిబ్రవరి 20 : రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ విజయ మహాలక్ష్మి తెలిపారు. గర్భిణులు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి సరైన మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, ఐశ్వర్య, సూపర్‌వైజర్ మంజూర్, గంగామణి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 20 : బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ - పైడిమల్ గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనాపూర్ గ్రామానికి చెందిన గైని సాయిలు(28) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనాపూర్ గ్రామానికి చెందిన సాయిలు వర్ని మండలం పైడిమల్ గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కింద పడ్డ సాయిలు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించినట్లు వారు తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం కామారెడ్డిలో చోటు చేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్ రోడ్‌లో నివాసం ఉంటున్న పసుపునూరి నాగయ్య (30) నాలుగేండ్ల క్రితం రమ్యతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తరుచూ నాగ య్య మద్యం తాగి భార్యతో గొడవ పడుతూ కొడుతూ తిట్టేవాడు. బుధవారం రాత్రి ఎక్కువ మద్యం తాగి భార్య రమ్య ను కొట్టడంతో ఆమె పక్క రూంలోకి వెళ్లి పడుకున్నది. తర్వాత రాత్రి సుమారు రెండు గంటల సమయంలో నిద్ర లో నుంచి భార్య లేచి భర్త నిద్రించిన రూంలోకి వెళ్లి చూసేసరికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగయ్య తండ్రి పసుపునూరి నాందేవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

దివ్యాంగుల దినోత్సవం

రాజంపేట్, ఫిబ్రవరి 20 : మండలంలోని తలమడ్ల గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ.. దివ్యాంగ పిల్లలను చిన్నచూపు చూడకూడదని, పిల్లలందరితో సమానంగా చూడాలని సూచించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తలమడ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, ఐఆర్పీ, సీఆర్పీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమార్‌పేట్‌లో ప్రారంభమైన
మురికికాలువల శుభ్రం

సోమార్‌పేట్ గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 20: ఫిబ్రవరి 15న శనివారం ''నమస్తే తెలంగాణ'' దిన పత్రికలో ''సోమార్‌పేట్‌లో ఆరు నెలలుగా శుభ్రం కాని మురికి కాలువలు'' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు గ్రామంలో మురికికాలువల శుభ్రతకు గురువారం నడుం కట్టారు. పారిశుద్ధ్య కార్మికులను ఎంగేజ్ చేసుకొని మురికికాలువలను శుభ్రం చేయిస్తున్నానని గ్రామ కార్యదర్శి రాజు తెలిపారు. ఆరు నెలలుగా గ్రామంలో శుభ్రం కాని మురికి కాలువలు శుభ్రం అవుతున్నాయని, సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'నమస్తే తెలంగాణ' పత్రికకు సోమార్‌పేట్ గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

గ్రామ మహిళా సంఘ నూతన కార్యవర్గం

పెద్దకొడప్‌గల్,(పిట్లం)ఫిబ్రవరి 20: పిట్లం మండలంలోని అల్లాపూర్ గ్రామంలో గ్రామ మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని మహిళా సంఘం సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మార్గం భారతి, ఉపాధ్యక్షురాలిగా నాగమణి, కార్యదర్శిగా సవితాబాయి, కోశాధికారిగా విజయలక్ష్మి, సహకార్యదర్శిగా సావిత్రిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల మహిళా సంఘం అధికారులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'యుద్ధభేరి'ని విజయవంతం చేయాలి

మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా మార్చి 2న నిర్వహించనున్న యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన గురువారం ఉపాధ్యాయులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూపీఎస్ విధానంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బాధ్యుడు అవినాశ్, వినీల్‌కుమార్, అరవింద్, సంగమేశ్వర్, కిష్టయ్య, ఉదయ్, రవిందర్, సతీశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కంపల్లిని సందర్శించిన ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 20: మండలంలోని అక్కంపల్లి గ్రామాన్ని గురువారం ఎంపీడీవో ప్రభాకర్ సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. బస్తీ దవాఖానను తనిఖీ చేశారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి కిష్టయ్య, సిబ్బంది ఉన్నారు.

ప్రమాదకరంగా లొంకలపల్లి రోడ్డు

● ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..? ●అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 20: మండల కేంద్రం గోపాల్‌పేట నుంచి లొంకలపల్లి మీదుగా లింగంపేట్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు పడి, తారు ఊడి, పలు చోట్ల కుంగి ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ దారి గుండా లొంకలపల్లి గ్రామం రెండు కిలోమీటర్లు, శెట్పల్లి సంగారెడ్డి 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దారి గుండా గోపాల్‌పేట నుంచి లింగంపేట మండలం, తాడ్వాయి, గాంధారి, జిల్లా కేంద్రం కామారెడ్డికి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డు పూర్తిగా కోతకు గురికావడం, పక్కనే చెరువు ఉండడంతో..రోడ్డు పలు చోట్ల కుంగిపోయింది. తారు పూర్తిగా లేచిపోయి ద్విచక్రవాహనాలు రోడ్డుపై వెళ్లకుండా పక్కకు వెళ్తున్నాయి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనీ.. ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరగ్గా..ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంటున్నారు. 15 ఏండ్ల క్రితం కంకర రోడ్డును బీటీ రోడ్డుగా మార్చిన అధికారులు.. నేటికీ కనీసం రోడ్డు పర్యవేక్షణ చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గోపాల్‌పేట నుంచి లొంకలపల్లి మీదుగా లింగంపేటకు వెళ్లే మార్గంలో గుంతలు పడి, తారు ఊడిపోయి ప్రమాదకరంగా మారిన రోడ్డు

ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ఢీకొన్న ట్రాలీ ఆటో

●ఇద్దరు అన్నదమ్ములకు గాయాలు

గాంధారి, ఫిబ్రవరి 20: గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు టాటా ఏస్ వాహనం (వాటర్ సప్లయ్ చేసే వాహనం) ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గాంధారి ఎస్సైతో పాటు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో కొన్నేండ్లుగా గిరిజన ఆశ్రమ పాఠశాల నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఆశ్రమ పాఠశాలలో మూడోతరగతి చదువుతున్న సాయికళ్యాణ్, నాలుగోతరగతి చదువుతున్న అర్జున్ హాస్టల్ ముందు ఆడుకుంటూ ఉండగా, గాంధారి వైపు నుంచి తిప్పారం వైపునకు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికళ్యాణ్ తలపై చర్మం ఊడిపోయి త్రీవ గాయమైంది, అర్జున్ కుడి కాలు విరిగింది. గాయపడిన విద్యార్థులను 108 వాహనంలో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గాయపడిన చిన్నారులు ఇద్దరు అన్నదమ్ములని, వీరు పిట్లం మండలంలోని కారేగాం గ్రామానికి చెందిన తానాజీ కొడుకులని 108 సిబ్బంది తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లనే విద్యార్థులకు గాయాలైనట్లు చుట్టుపక్కల వారు తెలిపారు.

టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో గాయపడిన గిరిజన పాఠశాల విద్యార్థి

మిగిలి పోయిన సోయా కొనుగోళ్లను తిరిగి ప్రారంభిస్తాం

బిచ్కుంద, ఫిబ్రవరి 20 : మద్నూర్ వ్యవసాయ మార్కెట్‌లో మిగిలిన సోయా పంట కొనుగోళ్లను తిరిగి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వం సోయా పంటను కొనుగోలు చేయగా, మద్నూర్ మార్కెట్‌లో సుమారు 8వేల క్వింటాళ్ల సోయా ఉండగా కొనుగోళ్లు నిలిపి వేశారన్నారు. దీంతో రైతులు ఆందోళన చెందడంతో, ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే సోయా కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారని, రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు.

గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలి

లింగంపేట్, ఫిబ్రవరి 20: మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్డీవో సురేందర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీలు తక్కువగా వస్తున్నందున వారి సంఖ్య పెంచాలని, ఇప్పటికే గుర్తించిన పనులు ప్రారంభించాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హరీతోపాటు ఉపాధిహామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని చేరడానికి వైకల్యం అడ్డుకాదు'

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈవో

రామారెడ్డి, ఫిబ్రవరి 20: లక్ష్యాన్ని చేరడానికి వైకల్యం ఏ మాత్రం అడ్డుకాదని, దాన్ని అధిగమించి, ముందుకు సాగి, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఎంఈవో ఆనంద్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో పీఎం శ్రీ పథకంలో భాగంగా ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో ది వ్యాంగ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం నింపడానికి గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పిల్లలకు టిఫిన్ బాక్సులు, స్వీట్లు పంపిణీ చేశారు. భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు సంజన, అటెండర్ శోభ సేవలను గుర్తించి వారిని సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ శివరాం, వైస్ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, పీఎంశ్రీ బాధ్యుడు సంతోష్ పాల్గొన్నారు.

జీపీల నిర్వహణకు నిధులు విడుదల చేయాలి

లింగంపేట్‌లో డీఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామ కార్యదర్శులు

లింగంపేట్, ఫిబ్రవరి 20: గ్రామ పంచాయతీల్లో అగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం నిధులను వెంటనే విడుదల చేయాలని గ్రామాల కార్యదర్శులు డీఆర్డీవో, లింగంపేట ప్రత్యేకాధికారి సురేందర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకవర్గం కాల పరిమితి ముగిసిన నుంచి జీపీల్లో రోజువారీ నిర్వాహణ కోసం షాపులు, వెండర్ల నుంచి అప్పుగా తీసుకొచ్చి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జీపీల నిర్వహణకు అవసరం ఉన్న నిధులను నేరుగా టీఎస్ బీపాస్ ఖాతాకు విడుదల చేయాలని, అలాగే సాధారణ నిధులను ట్రెజరరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లించడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఫర్మ్ వారు క్రెడిట్ ఇవ్వలేకపోతే మార్చి 1 నుంచి జీపీల నిర్వాహణ చేయలేమని వారు పేర్కొన్నారు.

లోక కల్యాణం కోసం చండీయాగాలు

చండీయాగం చేస్తున్న విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి

మద్నూర్, ఫిబ్రవరి 20: లోక కల్యాణం కోసం చండీయాగాలు ఉపయోగపడతాయని కర్ణాటకలోని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామిజీ అన్నారు. గురువారం డోంగ్లి మండలం కుర్లా గ్రామంలో నవచండీయాగం పూర్ణాహుతి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చండీయాగం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు.

మొక్కలు వాడిపోకుండా చర్యలు తీసుకోవాలి

ఎల్లమ్మతండా నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్నఎంపీడీవో

లింగంపేట్, ఫిబ్రవరి 20: వనమహోత్సవంలో నాటడానికి సిద్ధం చేస్తున్న మొక్కలు వాడిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నరేశ్ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఎల్లమ్మతండాలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన గురువారం పరిశీలించారు. నాటడానికి కావలసిన మొక్కలను సిద్ధం చేయాలని, ఎండలు తీవ్రంగా ఉన్నందున నీటిని పట్టాలని సూచించారు. మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.